# నమ్మి చెడినవాడు

నవంబరు నెలలో మొదటి సగం గడిచిపోయింది. కొండవైపు నుంచి చలి మెల్ల మెల్లగా ఊళ్లో ప్రవేశించింది. ఉదయం ఎనిమిది గంటలవేళ, ఎండైతే నిండుగానే వచ్చింది కాని ఆ ఎండలో వేడి లేదు. ఉన్న కాస్త వేడినీ కొండగాలి మింగి కూర్చుంది.

చిన్నిగాడు నాయుడిగారి పెరటి సాలలోంచి పసులమందని వీధిలోకి మళ్లించాడు. నాలుగు ఆవులు, మూడు గేదెలు, రెండు పడ్డలు, చివరగా ఒక చిన్న బక్కచిక్కిన నల్లమేక. ఆ నల్లమేక చిన్నిగాడి స్వంతం. దాని పేరు మాలచ్చిమి. అది, చిన్నిగాడి తల్లి నూకాలు పుట్టింటి నుంచి తెచ్చుకొన్న పది మేకలకి, వాటి పిల్లలకు మారుగా మిగిలిన ఒకే ఒక ప్రాణి. మిగిలినవన్నీ పోలిగాడి తాగుడికి చెల్లిపోయాయి.

నూకాలు బ్రతికున్నప్పుడు నల్లమేకకి నాలుగు కాళ్లూ ఉండేవి. నూకాలు ప్రాణంతో పాటు దాని కాలు కూడా ఎగిరిపోయింది. మొగుడు పెళ్లాన్ని చావబాదుతుంటే మధ్యగా తను వెళ్లకూడదు అనే తెలివిలేని మాలచ్చిమి యజమానురాల్ని రక్షించాలన్న ఆవేశంతో పోలిగాడి కాళ్లకి అడ్డం పడింది. కుతికమొయ్యా తాగొచ్చి కూడులోకి కోడికూర వండలేదని పెళ్లాం మీద చెయ్యి చేసుకొంటున్న వాడి మొదటి దెబ్బకి మాలచ్చిమి కాలు, రెండో దెబ్బకి నూకాలు బుర్ర చిట్లిపోయాయి.

పోలిగాడిని పోలీసులు పట్టుకుపోయేసరికి చిన్నిగాడి వయసు ఏడేళ్లకి లోపు. అనాథుడైన ఆ పసివాణ్ణి, అంగవికలమైన ఆ మేకపిల్లని ఆదుకుని కాపాడారు నాయుడు గారు. నూకాలు బ్రతికున్న రోజుల్లో నాయుడుగారింట పాచిపని చేసేది. పేరుకి పనిమనిషే కాని ఆ ఇంట్లో వారందరికీ తలలో నాలుకలా ఉండేది నూకాలు. రాత్రనక పగలనక ఒళ్లు దాచుకోకుండా ఇంటికింటెడు పనీ ఒక్క చేతి మీద చేసు కొచ్చేది. ఆ విశ్వాసం మనసులో ఉంచుకొనే నాయుడుగారు చిన్నిగాణ్ణి చేరదీసారు.

ఏడేళ్ల చిన్నిగాడు నాయుడుగారింట ఉంటూ తన తాహతుకి తగిన చిన్న చిన్న పనులు చేస్తుండేవాడు. వాడి ఒంటి మీదికి పదేళ్లు వచ్చేసరికి నాయుడుగారింట చిన్నిగాడి హోదా పెరిగింది. 'పనిగుంటడు' అల్లా 'పసుల కాపరి'గా మారిపోయాడు. వారు పెట్టింది తింటూ, వారు ఇచ్చింది కట్టుకొంటూ, వారి గొడ్లని మేపుకొంటూ, వాటి సరసనే పడుకొంటూ ఆ పసువులలో తనూ ఒకడుగా మారిపోయి జీవితం గడుపుకు రాసాగాడు చిన్నిగాడు.

మరమనిషిలా తనకి ప్రత్యేకించిన పనులు చేసుకొంటూ కాలం గడిపే చిన్నిగాడికి ఒక్కొక్క సమయంలో తల్లి గుర్తుకు వచ్చి కళ్లు చెమ్మగిల్లేవి. క్షణకాలం చేస్తున్న పనిని ఆపి తల్లితో తాను గడిపిన జీవితాన్ని, ఆ జ్ఞాపకాల్ని నెమరు వేసుకొనేవాడు. అంతలో ఇంట్లోంచి ఎవరో ఒకరు "చిన్నిగా" అంటూ పిల్చేవారు. కళ్లవెంట కారుతున్న నీటిని మండీతో

తుడిచేసుకొని, మనసులో బాధని చినుగుల లాల్చీ కింద దాచేసుకొని, “వత్తన్నాబాబూ” అంటూ అటు పరుగుపెట్టేవాడు ఆ నిర్భాగ్యుడు.

రాత్రిపూట ఒంటరిగా పసులపాకలో నిద్రపోతూంటే తండ్రి కలలోకి వచ్చి ఉలికిపాటుతో మెలకువ వచ్చేది. తండ్రి గుర్తుకు వస్తే ఎంత వేసవిలోనైనా వాడి ఒళ్లు గడగడ వణికిపోయది. శరీరం మీద రోమాలన్నీ మేకుల్లా నిక్కపొడుచుకొనేవి. భయంతో నోరెండిపోయేది. ఇంక ఆ రాత్రి పొడుక్కీ వాడి కంటి మీద రెప్ప పడేది కాదు. “అయ్యని పోలీసోళ్లు వాగ్గేత్తే” అనుకొనేవాడు. హడలిపోతూ, ఆ పరిస్థితిని ఊహించుకోలేక రెండు చేతులతో కళ్లు మూసుకొని కుప్పగా కూలిపోయేవాడు.

అటువంటి సమయాల్లో వాడికి దగ్గరగా వచ్చి, ధైర్యం ఇస్తున్నట్లు ముట్టితో రాస్తూ, కొమ్ములతో గోకుతూ వాడి పక్కలో దూరి పడుకొనేది మాలచ్చిమి. “అయ్యొత్తే మనిద్దర్నీ సంపేత్తాడే” అనేవాడు చిన్నిగాడు భయంతో దాన్ని దగ్గరికి లాక్కొంటూ.

‘నేనున్నా నీకేం భయంలేదు’ అన్నట్లు వాడి వంక చూసేది మాలచ్చిమి.

ఈ లోకంలో చిన్నగాడికున్న ఏకైక మిత్రుడు, అప్పుడు ఆ నల్లమేక ఒక్కటే! నిజానికి చిన్నిగాడికి మిత్రులు, శత్రువులు కూడా ఎవరూ లేరు. అంత చిన్నవయసులో తల్లిని కోల్పోయిన చిన్నిగాడిని చూసి “అయ్యోపాపం” అనేవారు చాలామంది. కాని ఆ సానుభూతి, జాలి అంతవరకే. అమ్మగారికి కోపం వచ్చి కడుపునిండా తిండి పెట్టనిరోజున వాడు ఆకలితో మాడి చావ్వలసిందే కాని ‘ఒరే చిన్నిగా వచ్చి కడుపు నిండా ఈ ఒక్క ముద్ద తినిపోరా’ అని ఆప్యాయంగా చేరబిలిచి పట్టెడు అన్నం పెట్టే తల్లులు ఆ ఊళ్లో లేరు. పని తిన్నగా చెయ్యలేదని అయ్యగారి చేతిలో దెబ్బలు తిని ఏడుస్తూ పాకలో పడి ఉన్న రోజున అభిమానంగా దగ్గరికి తీసుకొని తల నిమిరి ఊరడించే బాబులు అంతకన్న లేరు. వాడి మనసుకి, శరీరానికి దేనికి బాధ కలిగినా తన మనసులోని మాటని, ఆరాటాన్ని వాడు నిస్సంకోచంగా చెప్పుకోగలిగిన ప్రాణి, వాడి బాధ అర్థమైనా కాకున్నా అయినట్లే ప్రవర్తించి అనునయించే జీవి వాడితో సర్వవేళలా ఉండే మాలచ్చిమి ఒక్కటే!

కాపరి తమ వెంట వస్తున్నాడా లేదా అన్న విషయం పట్టించుకోకుండా అలవాటు పడిన దారిలో మిగిలిన పసువులు పడిపోతుంటే, చిన్నిగాడి పక్కపక్కనే రాసుకుంటూ ముందు కాలు కుంటుకుంటూ వాడితోపాటే మెల్లగా నడుస్తున్నది నల్లమేక. తన చేతిలో ఉన్న దాస్కెకర్రతో దారిలో ఎత్తుగా పెరిగిన చెట్ల కొమ్మల్ని విరిచి వాటిలోని లేత ఆకుల్ని, చిగుళ్లని తుంచి మాలచ్చిమికి తినపెడ్తున్నాడు చిన్నిగాడు. అది ఎంతో ప్రీతితో వాడి చేతుల్లోంచి ఆకుల్ని అందుకొని తింటూ కృతజ్ఞతాపూర్వంగా వాడివైపు చూస్తూ తృప్తిగా తలాడిస్తున్నది.

మాలచ్చిమి కడుపు నిండుగా ఆకులు తింటూంటే ముందు రోజు రాత్రి నుంచి ఖాళీగా ఉండిపోయిన తన కడుపు గుర్తుకొచ్చింది చిన్నిగాడికి. రాత్రి అమ్మగారు పెట్టిన అన్నం

చిన్నిగాడు కాళ్లూ చేతులూ కడుక్కొని వచ్చేలోపునే విరిగిపడిన మొండి గోడ దాటివచ్చిన ఊరకుక్క తినిపోయింది. ఆ మాట అమ్మగారితో చెప్పి, తిరిగి అన్నం పెట్టమని అడగాలంటే ఆమె దగ్గర చిన్నిగాడికి చచ్చేంత భయం. నాయుడు గారు ఊళ్లో వుంటే రాత్రి పడుకోబోయే ముందు పసులసాల వైపు వచ్చి పేరుపేరునా పసువులన్నిటినీ ఒకసారి పలకరించి పోయే అలవాటు ఉంది. యజమానితో ఏవన్నా చెప్పుకోవాలన్నా, అడగాలన్నా అదే సరియైన సమయం చిన్నిగాడికి. అయ్యగార్ని ఒక అణో, బేడో అడిగి పక్కవీధిలో ఉన్న టీకొట్లో ఓ కప్పుడు టీ తాగి పడుకొంటే తెల్లావారిపోతుంది. తెల్లారితే చల్దికూడు తినొచ్చు. ఈపాటిదానికి అమ్మగార్ని అడిగి ఆవిడచేత చీవాట్లు ఎందుకు తినడం అనుకొన్నాడు చిన్నిగాడు.

కాని, తెల్లారినా రోజూ వేళకి చల్ది అన్నం వాడి కంటపడలేదు. నిద్రలేచి గొడ్ల సావిట్లో కసవూడ్చి పోగు పెట్టాడు. వాకిలి తుడిచి కళ్లాపి చల్లాడు. కుడితి తొట్టెలో నీళ్లు నింపాడు. అయినా ఇంట్లోంచి చల్దికి పిలుపు రాలేదు. కడుపులో ఆకలి కరకర మంటుంటే చూపులన్నీ వంట ఇంటి గుమ్మం వైపు కేంద్రీకరించి పెరట్లో తచ్చాడుతున్న చిన్నిగాణ్ణి చూసి, "ఏరా ఈ రోజు పసువుల్ని మేతకి తోలుకుపోవడం ఉందా? లేదా? ఎంత వేళ మిగిలిపోయిందో చూసావా?" రోజురోజుకీ నీకు బద్ధకం బలిసిపోతున్నది" అంటూ కేకలు వేసింది నాయుడు భార్య.

చల్ది పెట్టకుండా పసువుల్ని మేతకు తోలుకు పోలేదని కేకలు వేస్తున్న యజమానురాలి వంక తెల్లబోయి చూస్తూ ఉండిపోయాడు చిన్నిగాడు.

"వెర్రిమొగం వేసుకొని ఏమిటా చూపు? నా ముఖాన బొమ్మలాడుతున్నాయా?" అంటూ విసుక్కొంది ఆవిడ.

"చల్దెడితే తినిపోతా" ఎలాగో కష్టంమీద నోరు పెగుల్చుకొని ఆ కాస్త మాటా అనేసాడు చిన్నిగాడు.

"ఓరి తిండిపోతు వెధవా! నీకెప్పుడూ తిండిగోలేరా! రాత్రికి కుంచెడు మింగావు కదా ఓపూట తిండి లేకపోతే మొక్క మొలిచిపోతావా? పనిసందట్లో పడి నీ చల్ది మాట మరచిపోయాను. స్నానం చేసాక మరి అంటూ, సొంటూ ముట్టుకోను. అమ్మాయీ, అల్లుడూ వస్తున్నారు. పెందరాడే మంద తోలుకొచ్చెయ్. మధ్యాహ్నం బువ్వలో బూర్లేస్తాలే" అంది అనునయంగా నాయుడి పెళ్లాం.

దిగాలు పడిన ముఖంతో చిన్నిగాడు గొడ్లని తోలుకుపోతుంటే, "ఈవేళ నాగుల చవితిరా! చెరువులో ఓ మునక వేసి నాగమయ్యకి దండం పెట్టుకో. రాత్రనక పగలనక తుప్పలంట, డొంకలంట తిరిగేవాడివి" అంటూ ఒక సలహా కూడా సరఫరా చేసింది.

చెరువుకట్ట దగ్గరికి వచ్చేసరికి చిన్నిగాడికి అమ్మగారి మాట గుర్తుకొచ్చింది. చల్లటి ఆ నీళ్లలో మునగడానికి క్షణకాలం వాడి మనసు వెనుకాడింది. కాళ్లు చేతులూ కడుక్కుపోతే

చాలదా అన్న ఆలోచన మనసులోకి వచ్చింది. కాని మరుక్షణంలోనే, "తానం సెయ్యకుండా దండమెడ్తే నాగమయ్యకి కోపమొత్తాదేమో" అన్న భయం మనసులో తిరుగాడి ఇంకో ఆలోచన లేకుండా నీటిలో ఒక మునక వేసాడు. వాడు పైకి లేచేలోపునే గట్టు మీద మాలచ్చిమి "మేమే" అంటూ అరవసాగింది. "నాను సెర్లో మునిగిపోనాననుకున్నాయేటే? అరత్తన్నావు. మునిగిపోనేదు. మునకేసాను. ఈయేల సవితిగందా? తానం సేసి నాగమయ్యకి దండమెట్టుకోవాలి" అన్నాడు చిన్నిగాడు గట్టు మీద ఎండలో బట్టలు ఆరబెట్టుకొంటూ. తన మిత్రుడు క్షేమంగా నీట్లోంచి బైటికి రావడం చూడగానే నల్లమేక అరుపులు మాని ఉత్సాహంగా వాడి దగ్గరకి వచ్చి నిల్చింది.

చెరువు గట్టుకు కొంచెం దూరంగా ఉన్న పుట్ట దగ్గర ఎవరో పూజ చేస్తున్నారు. చిన్నిగాడు పసువుల్ని కొండ మొదట్లో మేతకి వదలి పుట్ట దగ్గరికి వచ్చేసరికి వారి పూజ పూర్తి అయి అంతా వెళ్లిపోయారు. ముగ్గులతో, దీపాలతో కళకళ్లాడుతున్న ఆ పుట్ట ముందు కళ్లు మూసుకొని నిలచి నాగమయ్యకి మనస్సులోనే దండం పెట్టుకొన్నాడు. అలా పుట్టముందు నిలచి నాగమయ్యకి దండం పెట్టుకొంటుంటే చీకటినే లేచి స్నానం చేసి, కొత్త బట్టలు కట్టుకొని తల్లి వెంట తాను నాగమయ్య పూజకి మొదటిసారిగా పోయినరోజు గుర్తుకొచ్చింది చిన్నిగాడికి.

పూజ పూర్తిచేసుకొని తల్లీకొడుకులు ఇంటికి వెళ్లేసరికి కాల యముడిలా గుమ్మంలోనే కాసుకు కూర్చున్నాడు పోలిగాడు.... "దొంగనంజా! మొగుడు నోరిడిసి అడిగితే ఇయ్యడానికి నీకాడ దబ్బుల్లేవు కాని పూజలికి, వతాలకి, కొడుక్కి కొత్తగుడ్డలు కొన్నాడికి ఉన్నాయే? ఎక్కడ నేర్చావే ఈ ఏసాలన్నీ" అంటూ పెళ్లాన్ని పట్టుకు చితక బాదాడు. ఆ దెబ్బలతో ఒళ్లు బిగుసుకుపోయి పనిలోకి పోలేక మరునాడు వెళ్తే పండుగ పూట నాగా పెట్టిందని నాయుడు పెళ్లాం చెడ తిట్టింది.

"నాకేవొద్దు, కానీ మా యమ్మని ఆడేరూ కొట్టకండ సూడు భగవంతుడా" అంటూ నీళ్లు నిండిన కళ్లతో ఆకాసం వైపు చూసి చేతులెత్తి దండం పెట్టాడు చిన్నిగాడు!

"ఈ యేలకి ఈ బత్తి సాలుకాని నానోపని సెప్తా సేత్తావా?" అన్నాడు రాగవులు చిన్నిగాడి బుజం పట్టి కుదుపుతూ.

రాగవులంటే ఈ ఊర్లో ఉన్న పిల్లకాయలకి నాయకుడు లాంటివాడు. ఆ ఊరి పెద్దల దృష్టిలో రౌడీ లాంటివాడు. చిన్నిగాడికి రాగవులంటే మిగిలిన పిల్లల్లా భక్తి లేదు. కాని భయం మాత్రం దండిగా ఉంది. ఒకసారి నాయుడుగారి తోటలో రాగవులు మామిడి పిందెలు రాలగొట్టి పొరుగూరి కూరలమ్మికి అమ్మడం చూసి. ఆ విషయం నాయుడిగారితో చెప్పాడని, చీకటి చాటున చిన్నిగాడిని పట్టుకొని చితకదన్ని మరీ వదలిపెట్టాడు రాగవులు. "సిన్నోడివి కదాని ఈపాలికి ఇడిసిపెడ్తన్నా. ఇంకోసారి నా జోలికొచ్చావంటే మీ యమ్మకాడి కంపేగల్ను జాగ్రత్త" అంటూ వాడికి ఒక వార్నింగ్ కూడా ఇచ్చాడు.

చిన్నిగాడు బెదురుగా వాడివంక చూస్తూ, "నాను గొడ్లని మేపుకోలె" అన్నాడు నసుగుతూ.

"మేపుకో యేస్... ఏరొద్దన్నారు? గొడ్లు అటి మానాన అయి మేత్తుంటే నువ్ పల్లక కూకోడమేందట? అడ కూకొనేది ఈ రోడ్డు కాడ నిలబడు. అంతే" అన్నాడు రాగవులు.

"గొడ్లనొగ్గేసేనని తెలుత్తే అయ్యగారు తంతారు" ఎలాగైనా రాగవులు బాధ నుంచి తప్పించుకోవాలని చిన్నిగాడి ప్రయత్నం.

"సెప్తుంటే ఏటిరా ఎదవ నసుగుడు? ఊరకే సెయ్యొద్దులే పావల డబ్బులిత్తా వత్తాసంటే "చీకిష్ట"లో యన్టీవోడి చినెమా అడ్తంది. గేటుకాడున్నోడు మనోడే. చినెమాకి తీసుకెల్తా" చిన్నిగాడి బెదురు పోయేలా కొంచెం ఖుషామత్ చేసాడు రాగవులు.

పైవాటికి మించుమలె చిన్నిగాడు చెయ్యవలసినపనల్లా రోడ్డు దగ్గర నిలబడి, ఎవరైనా పుట్టలో పాలు పొయ్యడానికి వస్తున్నారేమో చూసి ఆ విషయం రాగవులుకి తెలిసేలా చిన్న ఈల వెయ్యడం, ఆ వచ్చిన వారితో ఆ పక్కనే మర్రిచెట్టు కింద ఒక పుట్ట ఉందని చెప్పి వారిని అక్కడికి తోడ్చుకురావడం.

అదేమంత కష్టమైన పనిగా అనిపించలేదు చిన్నిగాడికి. తను నిలబడే చోటు నుంచి చూస్తే కొండ మొదట్లో మేస్తున్న పసువులు స్పష్టంగా కనిపిస్తాయి. దరిదాపుల్లో పంటపొలాలు. తోటలు రోడ్లు వంటివి లేవు. ఆయాచితంగా చేతబడనున్న డబ్బులు, "యన్టీవోడి చినెమా" వదులుకోడం ఎందుకు?

కాని రాగవులు అలా ఎందుకు చెయ్యమన్నాడో వాడికి అంతుపట్టలేదు. పూజ కోసం కొందరు ఆడవాళ్లు అటు రాగానే రాగవులు చెప్పినట్టు వారిని పుట్ట దగ్గరికి తోడ్చుకొచ్చాడు చిన్నిగాడు. ఇంక నువ్వు వెళ్లు అన్నట్లు రాగులు కనుసౌంజ్ఞ చేసినా తిన్నగా వెళ్లిపోక వాడేం చేస్తాడో చూడాలన్న కుతూహలం కొద్దీ పక్కగా ఉన్నచెట్టు చాటున నక్కాడు చిన్నిగాడు.

పూజ చేసిన వాళ్లు అటు వెళ్లగానే చివరను గుండ్రంగా వంచిన ఒక ఇనుప ఊచ పెట్టి పుట్టలో వేసిన చిమ్మిరి చలిమిడి, కోడిగుడ్లు మొదలైనవన్నీ అతి చాకచక్యంగా పైకిలాగి చేతి సంచిలో వేసుకొన్నాడు రాగవులు. ఆ పని పూర్తి అయ్యాక పుట్టముందున్న ముగ్గులు చెరిపేసి, మట్టి ప్రమిదల్లో వారు పెట్టిపోయిన దీపాన్ని తీసి పక్కగా తుప్పల్లో పారేసాడు.

రాగవులు చేసిన పనితో చిన్నిగాడికి భయం పుట్టుకొచ్చింది. "ఓరొరె రాగవులూ! నాగమయ్యకి పెట్టింది నాగేత్తున్నావా? కల్లు పోతయిరా" అన్నాడు వణికిపోతూ.

"నిన్ను రోడ్డుకాడ ఉండమంటే ఈడనే కూకున్నవా? పైగా నీతులు సెప్తున్నవ్" అంటూ వాడిపై విరుచుకపడ్డాడు రాగవులు. వెంటనే తన కోపాన్ని అదుపులో పెట్టుకొని, "ఏటిరా నీ సొద? ఈ పుట్టలో నాగమయ్య కూకున్నాడేటి? ఈల్లేసిన పెసాదం తిని పోనాడేటి? నాను తియ్యకపోతే అయిగో ఆ సెట్టు మీద కూకున్నయ్ కాకులు, ఈల్లిటు పోగానే అయి ముక్కులతో పొడిసి ఎత్తకపోతయ్. అయి తింటే మరి పాపం లేదా? యెదవ కబుర్లు సెప్పక, నాను సెప్పినట్టు ఆ రోడ్డుకాడ కూకో" అన్నాడు రాగవులు చిన్నిగాణ్ణి మందలిస్తూ.

అంతలో మరో ఆడంగుల జట్టు రావడం, "ఇదిగో ఇలా రండి! ఈ పుట్టలో ఇంకా ఎవరూ పాలు పోసినట్టు లేరు" అంటూ అటు వెళ్లడం జరిగింది.

రాగవులు పుట్ట ముందు ముగ్గులెందుకు తుడిచేసాడో, దీపాలెందుకు తీసేసాడో అప్పటికి అర్థమయింది చిన్నిగాడికి. ఈ విధమైన మోసం పన్నెండు గంటల వరకూ సాగాక, రాగవులు చేతిసంచి సగందాకా నిండాక నాగమయ్య పూజ కోసం గ్రామస్తులు రావటం తగ్గుముఖం పట్టాక, "ఒరేయ్ చిన్నిగా నాను బజారుకెల్లి ఈ గుడ్లు అమ్ముకొత్తా, నా నొచ్చేదాకా నువ్విక్కడనే కూకో. పూజ కోసం ఎవరైనా వత్తే పుట్టకాడికి తీసుకుపోయి నాను తిరిగొచ్చేదాకా ఆడనే ఉండు. కన్నుసాటైతే పాడుముండ కాకులు పెసాదం ఎత్తుకుపోతయ్" అన్నాడు రాగవులు ఊరు దారి పడ్తూ.

రాగవులు వెళ్లాక నాగమయ్య పూజ కోసం ఎవరూ రాలేదు. సూర్యుడు నడినెత్తికొచ్చాడు. ఎండ బుర్ర మాడుస్తున్నది. మర్రిచెట్టు నీడలో సాగోరుదామని చిన్నిగాడు అటు కాలు కదపబోతుంటే ఓ తల్లి కూతుళ్లు అటు వచ్చారు. రాగవులు ఆజ్ఞ మేరకు వారిని తోడ్కుకుపోయి పుట్టని చూపించాడు చిన్నిగాడు. వాళ్లు ఎంతో భక్తి ప్రపత్తులతో పూజచేసి, పక్కనవున్న చిన్నిగాడి చేతిలో ఇంత ప్రసాదం వేసారు. దానిని అందుకుని భక్తితో నాగమయ్యని తల్చుకుని నోట్లో వేసుకున్నాడు చిన్నిగాడు.

అప్పటివరకు కాళ్లు కడుపులు తీరేలా ఇటు అటు తిరిగి మేత మేసిన పసువులు ఎండ వేడికి చెట్ల నీడల చేరి నెమరు వేసుకొంటూ విశ్రాంతి తీసుకోసాగాయి. కొండ పక్కన బండల మధ్యగా మొలచిన లేత గడ్డి పరకల్ని మోకాళ్లబడి ఏరుకు తింటున్నది లచ్చిమి.

రాత్రి నుంచి పస్తున్న చిన్నిగాడి కడుపులో ఆ కాస్త ప్రసాదం పడేసరికి అంతవరకు నిద్రకి జోగిన ఆకలి లేచి అగ్నిలా దహించేసింది. ఏదో విధాన తనని శాంతింప చెయ్యకపోతే ఉన్నపళంగా నిన్ను భస్మం చేస్తానంటూ వాడిని హడలు కొట్టింది. పండుగ పూట నన్ను కాల్చి చంపకు, తొందరగా ఇంటికి పద అని కడుపు బ్రతిమి లాడింది. 'పెందరాడే మంద తోలుకొస్తే మధ్యాహ్నం బువ్వలో బూర్లేస్తాలే' అన్న అమ్మగారి మాటలు చిన్నిగాడికి గుర్తుకొచ్చాయి.

మరో గంట గడిచింది. నడినెత్తి మీద సూర్యుడు తిరుగు ప్రయాణం మొదలు పెట్టాడు. ఎదురెండకి చెయ్యి అడ్డం పెట్టుకుని ఊరి దిక్కుగా చూసాడు చిన్నిగాడు. ఎక్కడా రాగవులు వస్తున్న జాడలేదు. పుట్ట విడిచి పోవాలంటే ప్రసాదం కాకుల పాలు చేసి వెళ్లిపోయాడని రాగవులు పట్టుకుని తంతాడేమోనని భయం. వాడొచ్చేదాకా అక్కడే ఉండాలంటే కడుపులో ఆకలి. నెత్తి మాడుస్తున్న ఎండ. దూరంగా గ్రామంలో అమ్మగారు తన కోసం ఎత్తిపెట్టిన పండుగ భోజనం. ఇంతకీ రాగవులు నిజంగా వస్తాడో లేక తనకి డబ్బులు ఇయ్యకుండా తప్పించుకుపోడానికి ఆ ఎత్తు ఎత్తాడో చిన్నిగాడికి అదీ తెలియదు.

మరో అరగంట గడిచింది. రాగవులు రాలేదు. ఆకలి కడుపుతో ఇక ఆ ఎండలో నిల్చే ఓపిక లేక కొడితే కొట్టనీ, రెండు దెబ్బలేకదా తినిపోతే తీరిపోతుంది అనే మొండి ధైర్యంతో అక్కడ నుంచి వెళ్లిపోబోతుంటే వాడి మనసులో ఒక ఆలోచన తళుక్కున మెరిసింది. పుట్టలో ఉన్న ప్రసాదాన్ని తీసి పట్టుకెళ్లి రాగవులుకి ఇచ్చేస్తే వాడిచేత తన్నులూ తప్పుతాయి. తనకి ఆకలితో ఎండలో మాడవలసిన అవస్థా తప్పుతుంది.

మెల్లగా పుట్టదగ్గరికి వెళ్లాడు చిన్నిగాడు. పుట్టలోని ప్రసాదాన్ని పైకి లాగడానికి రాగవులు ఉపయోగించిన ఇనప ఊచ అక్కడే ఉంది. దానిని అందుకొని నిదానంగా పనికి ఉపక్రమించాడు. పుట్టలోని నాగమయ్య తలపుకి వచ్చి క్షణకాలం వాడి చేతులు గడగడ వణికాయి. మరుక్షణంలో 'ఈ పుట్టలో నాగమయ్య కూచున్నాడేటి? ఈలేసిన పెసాదం తిని పోనాడికి' అన్న రాగవులు మాటలు గుర్తుకొచ్చాయి.

చిన్నిగాడి మనసులో జారిపోతున్న ధైర్యం తిరిగి నిలదొక్కుకొంది. రాగవులు లాగినట్లే అతి నేర్పుగా తల్లీకూతుళ్లు వేసిన ప్రసాదం అంతా పైకి లాగేసాడు. వాటికి కొంచెం కిందుగా తెల్లటి కోడిగుడ్డు కొద్దికొద్దిగా కన్పిస్తున్నది.

చిన్నిగాడు గుడ్డును పైకి లాగాలని ఎంతో ప్రయత్నం చేసాడు. అది వచ్చినట్లే కాస్త మేరకు వచ్చి తిరిగి పుట్టలోకి జారిపోయింది. రెండుసార్లు ప్రయత్నించినా కోడిగుడ్డును చిన్నిగాడు పైకి లాగలేకపోయాడు.

"మొత్తెం మూడోసారి, ఈసారి రాకపోతే ఇంకొగ్గేత్తాను" అనుకుంటూ ఇనప ఊచని జాగ్రత్తగా పుట్ట కన్నం లోపలికి దించాడు.

దూరంగ కొండపక్క నుంచి "మే" అంటూ మాలచ్చిమి అరుపు వినిపించింది. "వత్తన్నా నుండేస్" అంటూ కోడిగుడ్డును పైకి లాగడంపై దృష్టిని కేంద్రీకరించాడు చిన్నిగాడు.

కోడిగుడ్డు తీగె ఉచ్చులో ఇరుక్కొంది.

"దొరికి పోనావే నంజా" అంటూ ఊచని ఉత్సాహంగా పైకి లాగాడు చిన్నిగాడు.

"మే, మే" అంటూ నోరు ముయ్యకుండా అరుస్తుంది నల్లమేక.

"మల్లా కుక్కలెంట పడ్డాయినా ఉంది" ఆత్రంగా ఒకసారి అటు చూసి మనసులోనే అనుకొన్నాడు చిన్నిగాడు.

అంతకుపూర్వం ఒకసారి ఇలాగే ఎండవేళప్పుడు నాలుగైదు ఊరకుక్కలు కొండ వాలులో మేత మేస్తున్న మాలచ్చిమిని అటకాయించాయి. యమభటుల్లా ఎదుట నిల్చిన కుక్కల బారినుంచి తన కుంటికాలుతో అది తప్పించుకోలేక "మే...మే" అంటూ అరవసాగింది. కాస్త దూరంగా మామిడిచెట్టు నీడన పైగుడ్డ పరుచుకొని కునుకు తీస్తున్న చిన్నిగాడు మాలచ్చిమి అరుపుతో మేలుకొని అటువైపుగా పరుగు తీసాడు. మరొక్కక్షణం వాడు అక్కడికి వెళ్లకపోతే ఆ రోజుతో దాని ఆయువు తీరి ఉండేది. చిన్నిగాడి చేతిలో కర్ర చూసి ఊరకుక్కలు కాళ్లకి పనిచెప్పాయి.

పైదాకా వచ్చిన కోడిగుడ్డు వచ్చినట్లే వచ్చి మళ్లీ కిందికి జారిపోడం చిన్నిగాడు గమనించాడు. పుట్టని ఉన్న కన్నం మరేమంత చిన్నది కాదు. ప్రయత్నిస్తే చిన్నిగాడి చెయ్యి సులువుగానే అందులో దూరుతుంది. అంత శ్రమపడి తీసిన కోడిగుడ్డు అలా మోసం చేసి తిరిగి పుట్టలోకి జారిపోవడం వాడికి నచ్చలేదు. కుడిచేతిలో ఇనుప ఊచని అలాగే పట్టుకొని ఎడంచేతిని పుట్టలోకి దూర్చి జారిపోతున్న కోడి గుడ్డును చటాలున అందుకొన్నాడు.

"మే....మే...మే" అంటూ లేని శక్తిని కూడదీసుకొంటూ ఒక్కపెట్టున అరుస్తున్నది మాలచ్చిమి.

"వత్తానానుండే మాలచ్చిమీ" అంటూ ఒక కేకపెట్టి కోడిగుడ్డుతో పాటు మూసిన పిడికిలిని పైకి లాగాడు చిన్నిగాడు.

ప్రశాంతమైన ఆ పరిసరాలు ప్రతిధ్వనించేలా "మే" అంటూ ఒక గావుకేక పెట్టింది మాలచ్చిమి.

పైకిలాగిన చేతిని బాధతో విదిలించుకొంటూ "అమ్మో... ఓలమ్మో... సచ్చిపోనానే" అని అరుస్తూ కుప్పగా కూలిపోయాడు చిన్నిగాడు.

విశాలమైన ఆ ప్రదేశంలో మేక అరుపు, చిన్నిగాడి కేక మృత్యుదేవత చేసిన వికటాట్టహాసంలా క్షణకాలం ప్రతిధ్వనించాయి. అంతే..... అంతలోనే చలన రహితంగా నిలిచిపోయింది ప్రకృతి. జరగకూడనిదేదో జరిగిపోయింది అన్నట్లు స్తంభించిపోయింది గాలి. పైనుండి అంతా చూస్తున్న సూర్యుడు ఏమీ ఎరగనట్లే తన పని ముగించుకొంటూ ముందుకు సాగిపోయాడు.

కాపరి కోసం వేచి ఉండే ఓపికలేని పసువులు అలవాటుపడిన దారిలో ఇంటి ముఖం పట్టాయి.

కడుపు నిండిన కుక్కలు తృప్తిగా నాలుకలతో మూతుల్ని నాక్కొంటూ ఊరి వైపు నడక సాగించాయి.

పుట్టపక్క మర్రిచెట్టు మీద తల్లి కాకి పగిలిన కోడిగుడ్డులోంచి కారుతున్న సొనని నోటితో ఎత్తుకుపోయి గూటిలో ఉన్న పిల్లలకి ఆప్యాయంగా ఆరగింపు చేసింది.

రాంభజన కోవెల ముందు రావిచెట్టు తిన్నెపై ఒళ్ళు మరచి నిద్రపోయిన రాగవులు తుళ్లిపడి లేచి జేబులో డబ్బులు సరిగా ఉన్నాయో లేదో అని లెక్క చూసుకొంటూ, కాపరి లేకుండా ఇంటివైపు పోతున్న నాయుడుగారి మందని చూసి, "డబ్బుల కోసం ఇంకా ఆడనే కూకున్నాడు కాబోలు పిచ్చోడు" అనుకొన్నాడు నవ్వుకొంటూ.